శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అయ్యడపు రవీందర్ రెడ్డి

అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అయ్యడపు రవీందర్ రెడ్డి, సిటీ సివిల్‌కోర్టు జడ్జి సాయి కిరణ్, రాపోలు భాస్కర్ తదితరులు

సైదాబాద్, జూన్ 8: జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులంతా ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు అయ్యడపు రవీందర్ రెడ్డి, సిటీ సివిల్‌కోర్టు జడ్జి సాయి కిరణ్ అన్నారు. రాపోలు రామలక్ష్మి – రాములు జ్ఞాపకార్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలకు హాజరయ్యే వెనుకబడిన అభ్యర్థులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో ఉచిత శిక్షణ తరగతులను అనేక మంది నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు భార్గవ్, సునీల్ గౌడ్, రంగయ్య, శంకర్, విష్ణు, శ్రీధర్, ప్రభాకర్, కొమరయ్య పాల్గొని ప్రసంగించారు.

లోక్ అదాలత్ ఎంపిక సంతోషకరం

సమస్యల పరిష్కారంపై జస్టిస్ సుజయ్ పాల్

నాంపల్లి కోర్టు, జూన్ 8(నమస్తే తెలంగాణ): కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను ఎంచుకోవడం పట్ల తెలంగాణ హైకోర్టు జడ్జీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్ పాల్ సంతోషం వ్యక్తం చేశారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అరుణ కుమారి సమక్షంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుజయ్ పాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోపాల్‌లో ఉన్న నేషనల్ జుడీషియల్ అకాడమీకి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఉండటంతో తన కుటుంబ సభ్యులైన జుడీషియల్ అధికారులతో నేరుగా కలవలేకపోయానన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జుడీషియల్ అధికారులతో చర్చాగోష్టి జరిగిందని, వారంతా తనకు పూర్తి సహకారాన్ని అందించారని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలోని అన్ని న్యాయస్థానాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటం వల్ల కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, అందుకోసమే ప్రతి మూడు నెలలకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించడం ఉపయుక్తంగా ఉందన్నారు. ఇరువర్గాల సమ్మతంతో రాజీ చేసుకుని కేసులను తొలగించుకునేందుకు సువర్ణావకాశమన్నారు. ఓటమి, గెలుపు పట్ల ఆలోచించే ఆస్కారం ఉండదన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే లోక్ అదాలత్‌లో జుడీషియల్ అధికారులు (జడ్జీలు, మెజిస్ట్రేట్లు), పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భాగస్వామ్యులుగా ఉంటారన్నారు. వీళ్లందరి సహకారంతోనే జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా కొనసాగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, డీసీపీ స్వేత, జిల్లా జడ్జీ, చైర్మెన్ సురేష్, రమాకాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ ప్రారంభం

చర్లపల్లి, జూన్ 8: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కర్ రావు ప్రారంభించారు. కుషాయిగూడలోని జిల్లా కోర్టు అవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా ఇరువై మూడు బెంచిలను ఏర్పాటు చేసి మోటర్ ప్రమాద కేసులు, గృహహింస కేసులు, చెక్ బౌన్స్ కేసులతో పాటు 80,499 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. 32 సివిల్ కేసులు, 30,075 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా బాల భాస్కర్ రావు మాట్లాడుతూ, కక్షిదారుల కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌కు మంచి స్పందన వచ్చిందని, జిల్లా వ్యాప్తంగా ఇరువై మూడు బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డిలతో పాటు న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం: న్యాయమూర్తి నీలిమ

బండ్లగూడ, జూన్ 8: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లు ఎంతో పని చేస్తున్నాయని న్యాయమూర్తి నీలిమ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 10,437 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ, రాజీమార్గం ద్వారా అనేక కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇందులో రాజీ పడిన కేసులు 144, అడ్మిషన్ కేసులు 188, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1,521, పెట్టి కేసులు 8,330, విద్యుత్ చౌర్యం 253, ఒక బ్యాంకు కేసును పరిష్కరించారు. కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్‌కిరణ్, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రానోజీ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,12,515 కేసుల పరిష్కారం

రూ.18,85,13,393 వసూలు

నాంపల్లి కోర్టులు, జూన్ 8(నమస్తే తెలంగాణ): నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ముగిసిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,12,515 కేసులు పరిష్కరించబడ్డాయని కార్యదర్శి అరుణ కుమారి తెలిపారు. నాంపల్లి, సికింద్రాబాద్, మనోరంజన్ కోర్టుల్లో చెక్ బౌన్స్ -2702, కౌంపౌండబుల్ క్రిమినల్ కేసులు – 2061, వివాహ సంబంధ కేసులు – 213, ఎస్‌టీసీ (సమ్మరీ ట్రయల్ కేసులు) – 1,05, 833, విద్యుత్ కేసులు – 1706లను పరిష్కరించినట్టు తెలిపారు. మొత్తం రూ.18,85,13,393 నగదు వసూలైందన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు సహకరించిన మెజిస్ట్రేట్లు, ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8: తెలంగాణ విద్యార్థి ఉద్యమం ప్రపంచం గర్వించదగినదని ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల త్యాగం లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదని చెప్పారు. నలమాస కృష్ణ రచించిన 'ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం' పుస్తకాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడారు. ఈ పుస్తకాన్ని చూడగానే తెలంగాణ ఉద్యమ రచన మొదలైందనే సంతోషం కలుగుతోందన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమాన్ని సంఘటనగా కాకుండా, ఆ విద్యార్థి ఉద్యమ క్రమాన్ని రచయిత కృష్ణ పుస్తకంలో పొందు పరచాడని తెలిపారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ, పదేళ్ల తెలంగాణను సమీక్షించుకుంటున్న తరుణంలో ఈ పుస్తకం ఒక అవసరం అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటేశ్ నాయక్, గాలి వినోద్ కుమార్, నసుమాస స్వామి, విద్యార్థి నాయకులు మాండాల భాస్కర్, డేవిడ్, అరుణాంక్ లత, దుర్గం భాస్కర్, కోట శ్రీనివాస్, దరువు ఎల్లన్న, స్టాలిన్, కంచర్ల బద్రి, నెల్లి సత్య, మోహన్ ధరావత్ పాల్గొన్నారు.

ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ నేడు ఆఖరు



సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): ప్రకృతి, మానవ జీవన విశేషాలు, వాయు, అగ్ని పాత్ర, మహిళా సాధికారత తదితర థీమ్స్‌పై ఆకట్టుకునే పెయింటింగ్స్‌తో ఆర్టిస్టులు తమ ప్రతిభను చాటారు. గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ కోహినూర్‌లో కొలువుదీరిన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ఆదివారంతో ముగియనుంది. ఆధ్యాత్మికం, మానవ విలువలు, పల్లె వాతావరణం, ప్లాస్టిక్, కాలుష్య ప్రభావం తదితర థీమ్స్‌పై పలు పెయింటింగ్స్ వేసి ఔరా..! అనిపించారు. ఆర్టిస్టులు భారతీకేర్, సత్య, గాయత్రి తదితరులు ఆలోచన రేకెత్తించేలా పెయింటింగ్స్ వేసి ఆకట్టుకున్నారు. కాగా, ఈ ఆర్ట్ ఫెస్టివల్‌లో 250 మంది పెయింటింగ్స్ కొలువుదీరాయి. నేడు రాత్రి 8 గంటల వరకు ఈ పెయింటింగ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రిలయన్స్ జువెల్స్‌లో వివాహం కలెక్షన్స్

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): వివాహ వేడుకల నేపథ్యంలో రిలయన్స్ జువెల్స్‌లో సరికొత్త కలెక్షన్లు షోరూమ్‌ల్లో ఉన్నాయని రిలయన్స్ జువెల్స్ సీఈఓ సునీల్ నాయక్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న రిలయన్స్ జువెల్స్ షోరూములల్లో వివాహం కలెక్షన్స్ పేరుతో వీటిని ప్రదర్శించడంతో విక్రయానికి ఉంచామన్నారు. పెళ్లి కూతురు, పెళ్లి కొడుకులను దృష్టిలో పెట్టుకొని సంప్రదాయ డిజైన్లతో పాటు అత్యాధునిక శైలిలో యువతరానికి నచ్చేలా వినూత్న ఈ వివాహం కలెక్షన్స్‌లో ఉన్నాయి. 'ది క్వీన్ ఇన్ యూ' అనే పేరుతో ప్రారంభించిన ఈ వివాహం కలెక్షన్స్‌లో పెళ్లి కూతురుకు ధరించే దుస్తులు, విభిన్న శైలిలో రూపొందించిన డిజైన్లు ఆకట్టుకునేలా ఉంటాయన్నారు. దేశ వ్యాప్తంగా 200 నగరాల్లో ఉన్న 400 షోరూమ్‌ల్లో పెళ్లి సమయంలో ధరించే అభరణాలు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు.

మీడియా, సినిమా రంగాల్లో రామోజీ చెరగని ముద్ర

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రామోజీరావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్ జూన్ 8: మీడియా, సినిమా రంగాలలో రామోజీరావు చెరగని ముద్ర వేశారని, ఆయనో అక్షర బ్రహ్మ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీ రావు మృతి వార్త తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో రామోజీరావు పార్థివ దేహంపై పూల మాలలు ఉంచి నివాళులర్పించారు. ఆయన మృతి వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం వ్యక్తం చేశారు. సాధారణ వ్యక్తిగా జీవనం ప్రారంభించి తాను ఏర్పాటు చేసిన వివిధ సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఈనాడు పత్రిక ద్వారా అనేక వాస్తవాలను వార్తల రూపంలో తీసుకు వచ్చి తెలుగు ప్రజల మనసులో నిలిచిపోయారని అన్నారు. ప్రపంచంలో తెలుగు ప్రజలంతా గర్వపడేలా ఎంతో అద్భుతమైన ఫిల్మ్ సిటీని తీర్చిదిద్దిన ఘనత కూడా రామోజీరావుకు దక్కుతుందన్నారు. ప్రజాహితం, సమాజహితం కోసం కృషి చేసిన రామోజీరావు మృతి తెలుగు ప్రజలకే కాదని, దేశానికి కూడా తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సికింద్రాబాద్ శాసన సభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు రామోజీ రావుకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు పత్రికాభాషను అధునీకరించడంలో రామోజీరావు చేసిన కృషి విప్లవాత్మకమైందని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్యలు పేర్కొన్నారు. ఇంకా, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారిలు రామోజీ కుటుంబ సభ్యులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కొత్తగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్‌ను శనివారం సినీ నటి పూనమ్ కౌర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్టోర్‌లోని పలు ఆభరణాలను ధరించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. *– కొండాపూర్, జూన్ 8*

కోకాపేట నియో పోలిస్ లే అవుట్‌లో 33/11 కేవీ విద్యుత్ లైన్లు

రూ.1.23 కోట్ల పనులు చేపట్టేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ ప్రతిపాదన

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): కోకాపేటలో నియో పోలిస్ పేరుతో అభివృద్ధి చేసిన భారీ లే అవుట్‌లో మెరుగైన మౌలిక వసతులను హెచ్‌ఎండీఏ కల్పించింది. నగర శివారు ప్రాంతమైన కోకాపేట ఐటీ రంగానికి, ఆధునిక నివాసాలకు కేంద్రంగా మారడంతో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. సుమారు 529.66 ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా నియో పోలిస్ పేరుతో హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసింది. ఇప్పటికే 150, 120 అడుగుల వెడల్పుతో విశాలైన రోడ్లు, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్, మంచినీరు, డ్రైనేజీ లైన్లను అత్యాధునిక తరహాలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, ఔటర్ రింగు రోడ్డు మీదుగా కోకాపేట నియో పోలిస్ లే అవుట్‌తో అనుసంధానిస్తూ ట్రంపెట్‌ను హెచ్‌ఎండీఏ నిర్మిస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ సరఫరాకు సంబంధించిన అభివృద్ధి పనులను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చేపట్టనుంది. ఓఆర్ఆర్ ట్రంపెట్ నుంచి నియో పోలిస్ లే అవుట్ వరకు 33/11 కేవీ విద్యుత్ లైన్లను మార్చి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకోసం సుమారు రూ.1.23 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

ధిక్కార కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వక్తలు

రాజ్యాధికారం కోసం బహుజనులు ఐక్యం కావాలి

- ధిక్కార మహాత్మా పూలే స్ఫూర్తి కవిత్వం సంపుటి ఆవిష్కరణ
- సభలో సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్

రవీంద్రభారతి, జూన్ 8: బహుజనులు ఐక్యంగా పోరాటం చేయాలని, అప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని పూర్వ తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, నెల పొడుపు సాహిత్య సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో వెలువడిన 'ధిక్కార' కవితా సంకలనాన్ని జూలూరు గౌరీశంకర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ, చరిత్రలో ఇంత గొప్ప పుస్తకం తెచ్చినందుకు అభినందించారు. బహుజనుల చైతన్య పతాకాలుగా సంకలనంలో కవిత్వాలు ఉన్నాయన్నారు. దేశంలో అత్యధికంగా ఉన్న బీసీలను దామాషా ప్రకారం, వారికి రావలసిన రాజ్యాధికారం రావడం లేదని విమర్శించారు. బహుజనుల కోసం ధిక్కార స్వరంతో ఉద్యమించాలని సంఘటితంగా సమైక్యమై ఒకే వేదికగా ఉద్యమించాలని, ఆ సమయం ఆసన్నమైందని, ఐక్యంగా పోరాడితే విజయం సాధిస్తామని బీసీలకు న్యాయం చేద్దామని జూలూరు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ, దేశంలో బహుజనుల చైతన్యం అవసరమన్నారు. కులగణన చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. రిజర్వేషన్లలో కలాల లెక్కలు తేలనిదే పంచాయతీ ఎన్నికలకు తెరపడదన్నారు. పాలక వర్గాల కుట్రలు తెలుసుకొని బహుజనులు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, కాశన్న, దినకర వెంకట్ పవార్ ఖాజా పాల్గొన్నారు.

వైద్యుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

డీఎంఈ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ శేఖర్

డీఎంఈ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ శేఖర్

సుల్తాన్ బజార్, జూన్ 8: త్వరలో చేపట్టనున్న వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియను ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ చైర్మన్ డాక్టర్ వీ శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల డీఎంఈ బోధనాసుపత్రుల వైద్య కళాశాలల వైద్యులతో కోఠిలో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, 2018 అనంతరం 2024లో ఆరేండ్ల అనంతరం ప్రభుత్వం సాధారణ బదిలీల ప్రక్రియను నిర్వహిస్తుందన్నారు. ఈ బదిలీల ప్రక్రియలో క్యాపింగ్ (శాతం పరిమితి) లేకుండా నిర్వహించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాలలో పని చేస్తున్న వైద్యులను కేవలం ఆయా జిల్లాలకే పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఏళ్ళ తరబడి పని చేస్తున్న వైద్యులను మాత్రం జిల్లాలకే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఐదేళ్ళుగా ఒకేచోట పని చేస్తున్న వైద్యులకు స్థాన చలనం కల్పించడంతో పాటు రెండేళ్ళకు మించి గ్రామీణ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని వారు కోరారు. సాధారణ బదిలీలను రెండేళ్ళ కొకసారి నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్క వైద్యుడికి న్యాయం జరుగుతుందని అన్నారు. కాగా, ఎంతో కాలంగా బదిలీ కావాల్సిన కొందరు వైద్యులు అసోసియేషన్ల ముసుగులో బదిలీ కాకుండా ఒకే చోట పని చేస్తున్నారని, దీంతో వారి ఆగడాలు మితిమీరిపోయాయని వారు ఆరోపించారు. గత ఆరేళ్ళుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలలోని మెడికల్ కళాశాలల్లో పని చేస్తున్న వైద్యుల సేవలను గుర్తించి, నగరంలోని ఉస్మానియా, గాంధీ దవాఖానాలలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీల ప్రక్రియను నూతన ప్రభుత్వం సకాలంలో సజావుగా నిర్వహిస్తుందని పూర్తి విశ్వాసంతో ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు డాక్టర్లు చంద్రశేఖర్, నాగరాజు, సాంబశివారెడ్డి, జగతి, అమరావతి, కో కన్వీనర్లు సూర్య నారాయణ, బెంజిమెన్, మనీష్ గుప్తా, అరుణ, నీలవేణి, శిరోమణి, సభ్యులు సూర్యనారాయణ, అజమ్, మూసాఖాన్, అమరావతి, కవిత, హేమలత, శకుంతల పాల్గొన్నారు.

కేంద్రంపై మిలిటెంట్ పోరాటానికి బీసీలు సిద్ధం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ, తదితరులు

కాచిగూడ, జూన్ 8: కేంద్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేన్లు కల్పించడానికి పార్లమెంట్‌లో రాజ్యంగ సవరణ చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో 13 బీసీ సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ, త్వరలో చేపట్టబోయే కేంద్ర మంత్రివర్గంలో 50 శాతం బీసీలకు అవకాశం కల్పించి, తెలంగాణ రాష్ట్రం నుంచి ముగ్గురు బీసీలకు ఇవ్వాలని కోరారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, బీసీలంటే వాటాదారులని, దేశంలోని 80 కోట్ల మంది బీసీలకు రాజ్యాంగపరమైన హక్కులను కల్పించకుండా కేంద్రం అణిచివేస్తుందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తుందని, మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నీలం వెంకటేశ్, రాజేందర్, అంజీ, సురేశ్, నందగోపాల్, అనంతయ్య, రామకృష్ణ, ఉదయ్, రాజ్ కుమార్, జయంతి గౌడ్, నిఖిల్, ప్రితం పాల్గొన్నారు.

10 నుంచి ప్రజావాణి

'మేడ్చల్' కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూన్ 8(నమస్తే తెలంగాణ): ఈ నెల 10 నుంచి యధావిధిగా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల పక్రియ ముగిసినందున ప్రజావాణి యధావిధిగా కొనసాగుతుందన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, జూన్ 8: కేంద్ర ప్రభుత్వ అమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. కాచిగూడలో శనివారం ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీజీ, ఇంజనీర్, పాలిటెక్నిక్, డిప్లమా యువకులు ఈ నెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నం. 78931 41797, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

టీ-వర్క్స్ సందర్శనలో కార్పొరేట్ ప్రతినిధులు

సిటీబ్యూరో, జూన్ 8(నమస్తే తెలంగాణ): భౌతిక ఆవిష్కరణలకు కేంద్రమైన టీ వర్క్స్‌ను వ్యాపార వేత్తల ఫోరమ్, విద్యా సంస్థల ప్రతినిధులు శనివారం సందర్శించారు. టీ వర్క్స్ కేంద్రంగా జరుగుతున్న ఆవిష్కరణలపై నిర్వాహకులతో చర్చించారు. కొత్త ఆవిష్కరణలు చేయాలన్న ఆసక్తి ఉన్న వారికి టీ వర్క్స్ కల్పిస్తున్న వనరులు, ఔత్సాహికుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వారికి వివరించారు. కార్పొరేట్ కంపెనీల సహకారంతో ఆవిష్కరణలు చేయాలన్న ఆసక్తి ఉ